# జీవితం అంచున

— పాపినేని శివశంకర్

చుక్కల రాత్రి. నీలాకాశం మిలమిలలాడుతోంది. ఆకాశం సాక్షిగా సముద్ర కెరటాలు వెక్కి వెక్కి ఏడుస్తున్నాయి. ఒడ్డు నిర్మానుష్యంగా వుంది. కఠిన పాదాల కింద నలిగిపోయిన ఇసక చల్లగాలిలో గాయాల్ని నిమురుకుంటోంది.

దయాకర్ నిశ్శబ్దంగా నడుస్తున్నాడు బీచి వెంట. అడుగులు నిదానంగా పడుతున్నాయి. అంతా ఒక మగత. ఆలోచనల ముక్కలు. ఒక మహా ప్రయత్నానికి లేని హుషారు తెచ్చుకుంటున్నాడు. 'ఈ అర్ధరాత్రీ, చీకటి ప్రపంచం నన్నింకేం భయపెట్టలేవు' అనుకున్నాడు. అలలు కాళ్లకి తగిలి వెనక్కిపోతున్నాయి. 'ఇవాళ సముద్రం లోతెంతో చూస్తాను. సముద్రం నన్నేలా ఏం చేస్తుందో చూస్తాను. ఇంతేనటే సంద్ర మెంతో అనుకొంటే'— సన్నగా ఈల వెయ్యసాగాడు. ఈలలో లీలగా అపస్వరం.

'ఈ రాత్రి సముద్ర మెందుకో ఏడుస్తున్నట్టుంది వెక్కి వెక్కి' అనుకున్నాడు ఇంకా ఇంకా దూరం నడుస్తూ...'... నిజంగా సముద్రమేనా ఏడుస్తోంది?... అదేమిటి, సన్నగా ఎక్కణ్ణుంచో ఏడుపు వినబడుతోంది? ఈ సమయంలో నా కన్నా దౌర్భాగ్యులెవరున్నారిక్కడ?...'

దయాకర్ కళ్లు చిట్లించి చూశాడా చీకట్లో. కొంచెం దూరంగా ఒక రాయిమీద ఎవరో స్త్రీమూర్తి కూర్చున్నట్టుంది. ఆశ్చర్యం! 'అర్ధరాత్రి. ఈ వాతావరణంలో... దెయ్యం కాదుగదా! అయినా ఈ చివరి దశలో తనింకా దెయ్యాల గురించి భయపడటమేమిటి?' మెల్లగా సమీపించా డామెని. అతని కాళ్ల కింద ఇసక గరగర విని తలెత్తి చూసింది. ఒక్కసారిగా భయంతో వణికిపోయింది.

"నో! దగ్గరికి రావద్దు. ఈసారి నీ ప్రాణాలు తీస్తాను. లేదా సముద్రంలో దూకుతాను, రాస్కెల్! ఒంటరిగా అలాగే వున్నానని, మళ్లీ..." గొంతులో తీవ్రతని విహ్వలత్వం మింగేసింది, గుండెలు పగిలేట్టు ఏడుస్తోంది.

స్తంభించిపోయాడు దయాకర్. ఎవరామె? తనని చూసి ఎవరో అనుకొని ఎందుకంత భయపడుతోంది? తన మూలంగా ఆమె ఏడుపు ఎక్కువ కావటం సహించలేక పోయాడు. అడుగు ముందుకేస్తే నిజంగానే సముద్రంలో దూకుతుందేమో! అక్కడే ఆగి, నెమ్మదిగా అడిగాడు.

"నువ్వెవరు? ఎందుకేడుస్తున్నావు?"

ఈసారి ఆమె ఆశ్చర్యపోయింది. ఇతను వాళ్లల్లో వాడు కాదా? ఎవరో కొత్త వ్యక్తిలాగున్నాడు. ఎవరైతేనేం? ఒంటరి ఆడదాని దగ్గర ప్రతివాడూ దుర్మార్గుడే.

"ముందు నువ్వెవరో చెప్పు" ఫెడీమని అడిగిందామె.

"ఎవరో మనిషిని" నిర్లిప్తంగా జవాబిచ్చాడు దయాకర్.

"హు.. అందరూ మనుషులే. నిస్సహాయుల్ని మాత్రం కాటేస్తుంటారు"

దయాకర్ ఒక్కసారి ఆమెని పరీక్షగా చూశాడు. ముఖ కవళికలు స్పష్టంగా కన్పించటం లేదు. జుట్టు చిందరవందరగా వుంది. గొంతు వింటుంటే వయస్సు ఇరవై లోపే వుండొచ్చనిపించింది.

"నేను కాటెయ్యటానికి రాలేదు. ఈ రాత్రి సముద్రంతో చివరి సమావేశానికి వచ్చాను."

"అంటే?"

"ఆత్మహత్య చేసుకోవటానికొచ్చాను. దూరంగా నీ ఏడుపు విన్పించి..."

ఆమె ఏడుపు విన్పించి తనెందుకు అక్కడికి రావాలనుకున్నాడో ఇప్పుడర్థం కాలేదతనికి. చనిపోయే వాడికి ఎవరెవరి ఏడుపుల్తో నవ్వుల్తో నిమిత్తం ఏమిటి? అసలు తన ఆత్మహత్య సంగతి మాత్రం ఆమె కెందుకు చెప్పాలి?

అతని మాటలు నమ్మిందామె. ఒకసారి నిట్టూర్చి జుట్టు ముడేసుకుంది. కొంగుతో మొహం తుడుచుకుంది. తర్వాత కొంగు నడుముకి చుట్టుకుంది. చుట్టూ చీకట్లోకి ఒక్కసారి చూసి —

"అయితే పద. ఇద్దరం కలిసే చనిపోదాం. ఈ శరీరాన్ని ఇంకా భరించాలని లేదు" అంది నిశ్చయంగా.

దయాకర్ సందేహించాడు. తనకి తోడుగా ఈ అమ్మాయిని కూడా తీసుకుపోవటమా? ఊహు.. తన మరణంతోనూ మరొకళ్లకి సంబంధం వుండటానికి వీల్లేదు. బహుశా ఈమేదో ఉద్రేకంలో వుంది. ఆ కారణమేదో తెలుసుకోకుండా?... తన మరణం మరో గంట వాయిదా వేసి తెలుసుకుంటేనేం?... అయినా తెలుసుకుని తనేం చెయ్యగలడిప్పుడు? ఈమె నేం కాపాడగలడు? ఎవరైనా ఎందుకు కాపాడాలి తనీ సమయంలో? కాబట్టి తెలుసుకోకపోతేనేం?... అయినా తెలుసుకుంటేనేం? అన్నీ ద్వంద్వాలే. ఎన్నో ద్వంద్వాల మధ్య దారి దొరక్క చివరికీ మార్గం ఎన్నుకున్నాడు తను. చివరగా జీవన్మరణాల ద్వంద్వాన్ని మాత్రం ఛేదించబోతున్నాడు.

"తెల్లారటానికి చాలా సమయం వుంది. అప్పటి దాకా ఈ చీకట్లో మన చావు కెలాంటి అభ్యంతరమూ వుండదు. కాబట్టి ఈలోగా నీ బాధకి కారణమేమిటో చెప్పు" అడిగాడు దయాకర్ ఇసకలో చతికిల పడుతూ.


ఆమె కూడా పక్కనే కూర్చుంది. "తప్పకుండా చెబుతాను. ఈ మాత్రం జాలికి మొహం వాచి పోయాను చాన్నాళ్లుగా"

దయాకర్ ఆమె మాటల కడ్డొచ్చాడు. "నో నో. నాకు జాలి లేదు. జాలిలేని లోకం మీద జాలి పడటం మానేశాను. కేవలం నా మరణం మరో గంట వాయిదా వేసుకున్నాను కాబట్టి వింటాను."

"కారణం లేకుండా ఎందుకు వాయిదా వేసుకుంటారు? పోనీ మీకు జాలి లేకున్నా గాలికి చెప్పుకున్నట్టు నా బాధ చెప్పుకుంటాను. గుండె బరువైనా తగ్గుతుంది" అని ఒక్క క్షణం ఆగిందామె.

సముద్రం హోరు సముద్రం హోరులాగే వుంది. ఏడుపులాగా లేదు. ఒక్కో అలా వాళ్ల కాళ్లకి తగిలీ తగలకుండా వెనక్కి వెళ్లిపోతోంది. దూరంగా సరివి తోటలో గాలి చిక్కుబడి విలపిస్తోంది. నీలాకాశంలో చుక్కలు నిర్మలంగా వున్నాయి.

"నా పేరు సుమతి. మాది సంప్రదాయ కుటుంబం. అమ్మ లేదు. సవతి తల్లి మాత్రం వుంది. సవతి తల్లి రావటంతో నాన్న కూడా సవతి తండ్రే అయ్యాడు. మొత్తం నలుగురు పిల్లల్లో నేనే పరాయిదాన్ని. అయితే, ఇంట్లో ఆ పరాయితనం గురించి కాదు ఇప్పటి నా విచారం."



'మరి?' అన్నట్టు చూశాడు దయాకర్. మమతి గొంతు సవరించుకుని మళ్లీ చెప్పసాగింది. ఈసారి ఆమె కంఠం బరువెక్కింది.

"మొన్ననే బి.కాం. పరీక్షలు రాశాను. ఇంకా పైకి చదివిస్తారనే ఆశ లేదు. ఆశల్ని తుంచుకోవటం కూడా నేర్చుకున్నాను. నా ఇష్టం లేకున్నా రేపో మాపో పెళ్లి చూపులున్నాయి. ఈ పరిస్థితిలో మంచి స్నేహాలే నాకానందం కలిగించేవి. నిన్ననే నా ఫ్రెండ్ లలిత వచ్చి పిక్నిక్ ప్రోగ్రాం వేసింది. అయిష్టంగానే ఒప్పుకుంది 'అమ్మ'. ఇవాళ ఇద్దరం కలిసి ఈ సముద్రం ఒడ్డుకి వచ్చాం. సాయంకాలమంతా ఎంత సరదాగా గడిచి పోయిందో! చుట్టూ ఉల్లాసంగా ఎంతమంది మనుషులు! ఏ కుళ్ళా లేని ఈ సముద్రం! ఎంత దూరం నడిచామో, ఎన్ని కబుర్లు చెప్పుకున్నామో! కాలం తెలీలేదు. తిరిగి చూస్తే బీచ్ అంతా నిర్మానుష్యంగా వుంది. గబగబా సామాను సర్దుకుంటున్నాం బయల్దేర టానికి. అప్పుడు...

... అప్పుడొచ్చారు ఇద్దరు రాక్షసులు. తాగి వున్నారు. ఆ మైకం కన్నా కామం మైకమే ఎక్కువ. రావటంతోనే మమ్మల్ని పట్టుకున్నారు. మేం దిమ్మెర పోయాం. తేరుకుని అటూ ఇటూ పరిగెత్తాం భయంతో. మా కేకలు వింటాని కెవరున్నారు? వాళ్లు మమ్మల్ని వదల్లేదు. లలిత... అదెలా తప్పించుకుందో చీకట్లో ఎటు పరిగెత్తిందో తెలీదు. నేను మిగిలాను, ఇద్దరు బలవంతులైన రాక్షసుల మధ్య. భయంతో మరింత బిక్కచచ్చిపోయాను. వాళ్లు, ఆ రాక్షసులు, ఆ పరిని హోటల్లోకి నన్ను లాక్కెళ్లి, నోరు మూసి, ఒకళ్ల తర్వాత మరొకళ్లు..." ఆమె మాటల్ని ఏడుపు మింగేసింది.

దయాకర్ ఎంత నిర్లిప్తంగా వుందామన్నా వుండలేక పోయాడు. మనిషిమీద మనిషెందుకు అత్యాచారం చేస్తాడు? అత్యాచారమంటే ఎదటి మనిషిని ముక్కలు చెయ్యటమే గదా!


"ఏడవొద్దు నువ్వు. నేను భరించలేను. నువ్వేడుస్తుంటే ఈ లోకంతో పాటు నేను కూడా నీ ముందు అపరాధినే అనిపిస్తుంది. ఊరుకో, ఈ ప్రపంచం నిన్నే కాదు, నన్నూ అవమానించింది" అన్నాడు దయాకర్ సముద్రం వైపే చూస్తూ.

"అంటే?"

"గాయం తీవ్రమైన గాయం. ప్రపంచం నీ మీద ఒక విధంగా అత్యాచారం చేస్తే నామీద మరో విధంగా అత్యాచారం చేసింది. నన్ను నన్నుగా బతకనివ్వలేదు. ఈ ప్రపంచంతో తీరని శత్రుత్వం నాది. చిన్నప్పుడు నేను స్కూలుకి వెళ్లకుండా వెళ్లానని అబద్ధం ఆడితే మా నాన్న తన్నాడు. ఆయనే తాగొచ్చి తాగలేదని అబద్ధం ఆడతాడు. అమ్మా నాన్నా ప్రతి రోజూ పరస్పరం తిట్టుకుంటూ ప్రతి రోజూ ఒకే పక్కమీద పడుకుంటూ దాంపత్యం నటిస్తారు. పిల్లల మీద ప్రేమ నటిస్తారు. కాలేజీలో మాస్టర్లు ఎన్నటికీ పనికిరాని పాఠాలు చెబుతూ దేశసేవ చేస్తున్నట్టు నటిస్తారు.

"చాలామంది నన్ను మేధావి అన్నారు మొదట్లో. సూపర్ కండక్టివిటీ మీద నేను రాసిన వ్యాసాలు పెద్ద సంచలనం కలిగించాయి. కానీ ఎవ్వడూ ఉద్యోగమివ్వడు. ఎన్ని ఇంటర్వ్యూలకు ఆఫీసుల చుట్టూ తిరిగాను! ప్రశ్నలు వేసే వాడికి జవాబులు తెలీవు. 'భూగోళం బరువెంత?' అని అడిగాడొకడు. నీ తల కాయంత అని చెప్పేశాను. మూర్ఖుడు అన్నారు. ఎవడు మూర్ఖుడు? మేధావుల్ని కాలదన్ని గూండాల్ని బలిపిస్తున్న ఈ దేశం పెద్ద మూర్ఖురాలు. వాడు... వాడు నాకు తెలిసి పదకొండు హత్యలు చేశాడు. ప్రజా నాయకుడయ్యాడు. నడి బజార్లో వాడి విగ్రహావిష్కరణ. అందరూ చూస్తుండగా వెళ్లి దానిమీద ఉమ్మేశాను. నన్ను తరిమి కొట్టారు. రెండు రోజుల్నించీ తిండి లేదు. గాయం, ఎక్కడో లోతైన గాయం. ఈ ప్రపంచం నన్ను మనిషిగా గుర్తించలేదు. నేను మాత్రం దీన్నెందుకు గుర్తించాలి? నా మరణంతో ఈ ప్రపం

## ఏకాత్మ్రికం



నువ్వు పువ్వైనపుడు
నీ సౌరభాన్నాఘ్రాణించాను.
నువ్వు నవ్వైనపుడు
ఆనందాభిషిక్తుడనయ్యాను.
నువ్వు నువ్వైన యిపుడు
నీలోనే నిలిచి వున్నాను.
"నువ్వు" ఉన్నంత వరకూ
దానిలో ఉండే 'నేనె'లా
నువ్వున్నంత వరకూ
నీలో ఉంటాను నేను -
అవునా? ఒక మాట —
నిన్నూ నన్నూ వేరు చేయాలని
ఉద్యమిస్తున్నారు నేడు!
ఉద్యమం ఉత్తరవుతుందే కాని
నీ నాల నిలకడ నిలిచే ఉంటుంది
నువ్వూ నేనూ ఉన్నంతవరకూ -
నీవో నేనో ఉన్నంత వరకూ
నీలో నేనో - నాలో నువ్వో
నిలిచే ఉంటాం
రెండు రూపాలుగా కనపడే
ఒక ఆత్మ అయిన నువ్వూ నేనూ
ఇక్కడ లేకుండా పోయేటంతవరకూ!
సాయుజ్య గమ్యానికి సాగే
'నీ నా'ల ఆత్మ యానంలో
అతిథిశాల మన జీవితం.
ఈ జీవితం నుండి
మన యానం విడివిడిగా సాగినా -
కుడి యెడమ భాగాలు
కూడి ఉన్నప్పుడే దేహం
ఈ దేహం ఉన్నంతవరకే
ఇక్కడ జీవితం!
నువ్వూ నేనూ కలిసి
ఒకే ద్రుమంగా ఎదిగి
వృక్షంగా విస్తరించాం శాఖోపశాఖలై!
ద్రుమంగా ఉన్నంతవరకూ
దాని ద్వారానే జీవితం పోసుకుంటాయి శాఖలు -
మనిషిపోయేక
దేని జీవితం అదే చూసుకుంటుంది -
అప్పుడు నువ్వుండవు
నేను లేను!

మేకా సుధాకరరావు

న్ని గుర్తించటం మానేస్తాను."

కాసేపు తన సంగతి మరిచిపోయి అతని వంకే చూస్తుండిపోయింది మమత. మెల్లగా తేరుకుంది.

"ఇంకెందుకు కాలవ్యం? చావటానికి ధైర్యం చాలక ఇప్పటిదాకా కూర్చున్నాను. పద, తోడుగా నచిపోదాం. నా శరీరం మలినమైపోయింది. శీలం పోయినాక ఇంకా బతికెందుకు?" అని పైకి లేచింది మమత.

"నీ మీద చాలా కోపమొస్తోంది నాకు. లోకం వల్లించే మాటల్నే నువ్వూ వల్లిస్తున్నావు" అన్నాడు దయాకర్ చేతికందిన గులకరాయి అలల్లోకి విసిరేస్తూ.

అర్థంకానట్టు చూసిందామె.

"శరీరం మలినం కావటం, శీలం కోల్పోవటం- ఇవన్నీ నీ మాటలు కావు. నాకు జవాబు చెప్పు, శరీరం మలినం కావటమంటే ఏమిటి? శీలమంటే ఏమిటి? ఆ పదార్థం ఎక్కడుంది?"

తికమక పడింది మమత, వెంటనే జవాబు చెప్పలేక.

"ఆ విషయం మళ్ళీ తలుచుకుంటానికే అసహ్యంగా వుంది. నన్ను బలాత్కారించారు వాళ్ళు. ఇంకా నా శరీరం మలినం కాకుండా ఎలా వుంటుంది?"

"మలినమైంది నీ శరీరం కాదు. వాళ్ళ జీవితం. ఇష్టంలేని వాళ్ళని హింసించినవాళ్ళు వాళ్ళు. వాళ్ళని ముక్కలు చేసి సముద్రంలో జాడించినా ఆ కుళ్ళు పోదు. కానీ నువ్వేం తప్పు చేశావు మలినం కావటానికి?"

"మరి నా కన్యాత్వం సంగతేమిటి?"

నవ్వాడు దయాకర్.

"నువ్వు కన్యగా వుంటానికి లేకుంటానికి తేడా ఏమిటి? అందువల్ల జీవితంలో ఏం మార్పొస్తుంది? నీ పేరేమిటన్నావ్, మమత గదూ! వాళ్ళు నిన్ను బలాత్కారించక ముందూ ఇప్పుడూ అదే మమతవి కాదా?"

"ఎలా అవుతాను? ఇన్నాళ్ళూ ఎంత పవిత్రంగా వున్నాను? కాలేజీలో ఏ మగవాణ్ణీ తాకలేదు. నా సర్వస్వం భర్తకే అర్పించుకోవాలనుకున్నాను."

"ఎవరు నీ భర్త?"

"ఏమో"

"ఎవడో తెలీనివాడికోసం ఏదో దాచి వుంచటం ఏమిటి? దాచివుంచటానికేముందక్కడ? మగవాణ్ణి తాకినంత మాత్రాన పోయే పవిత్రత మీద నాకు నమ్మకం లేదు. 'సర్వస్వమూ', 'సమర్పణా'- హు, నీ సర్వస్వం నీ అవయవాలేనా? నీ అవయవాల మీద దాడి చేసినవాడు నీ సర్వస్వాన్ని కాజేసినట్టేనా? బజార్లో నా మీద జరిగిన దాడికీ, నీ మీద జరిగిన దాడికీ ఫలితంలో తేడా ఏమీ లేదు. అవయవాల బాధ, అవమానం-అంతే. మనం సహించరానిదదే."

ఏం మాట్లాడలేదు మమత.

"ఎంతో మంది స్త్రీలు మానం పోయిందని బావుల్లో చెరువుల్లో దూకటం నేనెరుగుదును. మగాడికి లేని మానం ఆడదానికెందుకుండాలి? మానం అనేదే వుంటే అది పరాయివాడు బలాత్కారించినా పోయినట్టే. భర్త మీదపడ్డప్పుడైనా పోయినట్టే. అంటే, నా వుద్దేశం మానం అనేది లేదు. మనకి నచ్చిన మనిషి దగ్గరైనప్పుడు మనసులూ, శరీరాలూ ఏకమౌతాయి, లేకుంటే లేదు"

"కానీ లోకం ఊరుకోదు."

"లోకం మాటెత్తకు. లోకానికే శీలం వుంటే నువ్వు శీలం లేనిదానివెట్లా అవుతావు?"

"వాదానికేం? నన్నెవరు పెళ్లి చేసుకుంటారు?"

"పెళ్లి మనిషికంత అవసరమా? అవసరమనుకుంటే నిన్నర్థం చేసుకునేవాడికోసం ఎదురుచూడు."

"ఎంత చిత్రంగా వున్నాయ్ నీ మాటలు? శీలం లేనిదాన్ని, నువ్వయితే అంగీకరిస్తావా?"

"మళ్లీ అవే మాటలు, శీలం గీలం అంటూ. నేను నా గాయాల్ని శాశ్వతంగా మాన్పుకునే ప్రయత్నంలో వున్నాను. లేకుంటే నిన్నంగీకరించటానికి నాకేం అభ్యంతరం లేదు."

"అబద్ధం" అరిచింది మమత.

"అలాగే అనుకో. ఇప్పుడు నా మాటల్ని మళ్లీ పరీక్షించుకోవాల్సిన అవసరమేం లేదు. సముద్రం లోతునే నేనిప్పుడు పరీక్షించాలి" అంటూ లేచాడు దయాకర్.

"ఈ పరిస్థితిలో నన్నొదిలేసి నువ్వొక్కడివీ చని పోతావా? నన్నూ నీతోపాటు తీసుకెళ్ళు."

"చావబోయే వాళ్లకి చేయూతెందుకు? నిముషం గడిస్తే మన శవాలెక్కడెక్కడ తేల్తాయో? మన అస్తిత్వమే మిగలదు. అయినా..." అర్థోక్తిలో ఆగిపోయాడు దయాకర్.

దూరంగా ఏవో రెండు ఆకారాలు వస్తున్నాయి వాళ్ల వైపు. మమత భయంతో బిగుసుకుపోయింది.

"నీ స్నేహితురాలై వుంటుంది. ఎవర్నో తీసుకుని నిన్ను వెదకటానికి వస్తోందేమో" అన్నాడు దయాకర్

"పిట్టలింకా ఇక్కడే వున్నాయ్ రోయ్! గురుడు చెప్పింది నిజమే." అందో గొంతు.

"అయితే మన పంట పండిందిలే. చెరో చెయ్యేద్దాం పద" అంటోంది రెండో గొంతు.

దయాకర్ చెవులు రిక్కించాడు. రెండు మగ గొంతులు. మమతని బలాత్కారించినవాళ్లూ వీళ్లూ స్నేహితులై వుండాలి. సంగతి తెలుసుకుని తామూ అత్యాచారం చెయ్యటానికి వస్తున్నారు. హో! ఏం లోకం ఇది?

"చిన్న డౌట్రా! వాళ్లకి ఒక్కతే చిక్కిందన్నారు గదా! మరిక్కడ రెండు కనబడుతున్నయ్యేమిటే?"

"పారిపోయిన పిల్ల కూడా మళ్లీ వచ్చిందేమో."

"అయితే మరీ మంచిది. చెరొక్కటి. జాగర్త. పారిపోనియ్యొద్దు. మనమూ పరిచితోటలోకే."

"ఒహోయ్!" అరుస్తూ రెండు ఆకారాలు గంతు

లేస్తూ దగ్గరకొచ్చాయి.


మమత భయంతో వణికిపోయింది. నోట మాట రాలేదు. దీనంగా దయాకర్‌ని వాటేసుకుంది. ఆమె గుండెలు పగుల్తున్న చప్పుడు వినబడుతోంది దయాకర్‌కి. తనేం చెయ్యాలి? గబుక్కున ఆమెతో పాటు సముద్రంలో దూకితే? కానీ అంతమాత్రం చేత ఆమె గాయం మాసిపోతుందా?"

అతని ఆలోచన తెగేలోగా ఒక ఆకారం దురుసుగా మమత చెయ్యి పట్టుకుంది. మరోటి దయాకర్‌ని పట్టుకు లాగింది. చెయ్యిముళ్ల స్పర్శ. గుప్పున విస్కీ వాసన.

లేదు లేదు. ఇక్కడ పలాయనానికీ, మరణానికీ తావు లేదు. మరోసారి ఆమె మీద అత్యాచారానికి తను సాక్షీభూతుడై అపరాధి కాలేదు. లేదు లేదు. మరొక్క గాయాన్ని సహించేది లేదు. గాయానికి ప్రతీకారం తీర్చుకోవాల్సిందే. శరీరం సహకరించటం లేదు. రెండు రోజుల ఆకలి శరీరం. అయినా శక్తిని పూనాల్సిందే. గాయం గాయం ప్రతీకారం ప్రతీకారం.

వాడు మమతని తన నుంచి వేరుచేసి ఇసకలో బరబరా లాక్కెళుతున్నాడు. ఆమెలో ప్రతిఘటించే శక్తి లేదు. సన్నగా ఏడుస్తోంది. రెండోవాడు తన మొహంలో మొహం పెట్టి అనుమానంగా చూస్తున్నాడు. కడుపు తెమిల్చే వాసన. జీవితాన్ని తెమిల్చే పరాభవం.

దయాకర్ ఒక్కసారిగా చేతులు విదిలించుకుని ఎదుటి మనిషి పొట్టలో ఒక్క గుద్దు గుద్దాడు. ఊహించని దెబ్బకి దిమ్మెరపోయాడు వాడు. వాడు తేరుకునేలోగా దయాకర్ చేతుల్నిండా ఇసక తీసుకుని కళ్లల్లో కొట్టాడు. గొల్లుమంటూ వాడు ఇసకలో పొర్లాడసాగాడు కళ్లు నులుముకుంటూ.



దయాకర్‌లో ఉద్రేకం ఆగలేదు. 'రేయ్ ఆగు' అంటూ ఎక్కల్లేని ఊపుతో పరిగెత్తుతూ మమతని లాక్కెళుతున్నవాడి వెంట పడ్డాడు. వాడు తమాయించుకునేలోగా ఎగిరి మీదకి దూకి వాడి గొంతు వంకలో ఇరికించుకున్నాడు. విడిపించుకోవటానికి విశ్వప్రయత్నం చేశాడు వాడు. దయాకర్ చేతుల్ని పట్టుకు లాగాడు. గుద్దాడు. రక్కాడు. కానీ దయాకర్ వదల్లేదు. తనలో ఇంకా అంత శక్తి ఎక్కడుందో తెలీదు. వాడి శరీరం తెలివితప్పి ఇసకలో దభీమని పడిందాకా వదల్లేదు. రెండోవాడు కళ్లు నులుముకుంటూనే పరిగెత్తాడు.

యుద్ధం ముగిసింది. కెరటాల హోరు తప్ప అంతా నిశ్శబ్దం. దయాకర్ తనేం చేశాడో ఎందుకు చేశాడో ఒక్క క్షణం అర్థం కాని పరిస్థితిలో అలాగే నిలబడ్డాడు. మమత పరిగెత్తుకుంటూ వచ్చి అమాంతం దయాకర్‌ని వాటేసుకుంది. ఆమె కళ్ల నుంచి కృతజ్ఞతతో ప్రేమో కన్నీరై ప్రవహిస్తోంది. అప్రయత్నంగా దయాకర్ ఆమెని తన హృదయానికి హత్తుకున్నాడు. ఎంత ఉపశమనం! జీవితానికి జీవితం తోడు.

రెండు నిముషాలు గడిచాయి. అతని కౌగిలి నుంచి విడిపోకుండానే మమత మొహం పైకెత్తి చూస్తూ అడిగింది "ఇప్పుడేం చేద్దాం?"

"నా గాయానికేదో మందు దొరికినట్టుంది. మనం మరణించటానికి వీల్లేదు. పద, ఇద్దరం సముద్రంలో మునుగుదాం. లోతు చూట్టానికి కాదు. రెండో జీవితాన్ని విప్పంకోవంగా ప్రారంభించటానికి."

దయాకర్ ఆమె చెయ్యి పట్టుకుని తడి ఇసకలో ముందుకు నడిచాడు. తెలీని ధైర్యంతో కన్నీళ్లు తుడుచుకుంది మమత.

నీలాకాశం మిలమిలలాడుతోంది. దూరంగా ఏదో వెలుతురు కన్పిస్తోంది.

